


www.vibharenews.com

# విభారె

తెలుగు దినపత్రిక


VIBHARE TELUGU DAILY






PUBLISHED FROM KURNOOL | ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి | శుక్రవారం | 31-03-2023 | సంపుటి : 04 | సంచిక : 186 | పేజీలు : 4 | వెల : రూ 3-00


## రాజకీయ ప్రసంగాలపై సుప్రీం ఫైర్



న్యూఢిల్లీ రాజకీయ విద్వేష ప్రసంగాలపై సుప్రీం కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. రాజకీయ నాయకులు రాజకీయాల కోసం మతాన్ని వాడుకోవడం ఆపినప్పుడే దేశం అభివృద్ధి చెందుతుందని సుప్రీం కోర్టు అభిప్రాయపడింది. విద్వేష ప్రంసంగాలు ఓ విష వలయం అని.. రాజకీయాలను మతంలో కలపడం అనేక సమస్యలకు దారి తీస్తుందని వివరించింది. విచ్ఛిన్న శక్తులే ఇలాంటి పను చేస్తున్నాయని పేర్కొంది. ఇది ప్రజస్వామ్యానికి చాలా ప్రమాదం అని.. దీన్ని అడ్డుకునేందుకు ప్రభుత్వం తక్షణమే ఓ మార్గం చూడాలని ధర్మాసనం సూచించింది. ఇటీవలే తీర్పులోనూ సుప్రీంకోర్టు ఇదే విషయాన్ని నొక్కిచెప్పిందని న్యాయమూర్తులు కె.ఎం జోసెఫ్, బి.వి నాగరత్న ధర్మాసనం గుర్తు చేసింది. టీవీలు, పేపర్లు, సామాజిక మాధ్యమాల వేదికలపై ఇటీవల విద్వేష ప్రసంగాలు ఎక్కువయ్యాయని అభిప్రాయం వ్యకం చేశారు. మత విద్వేషకర వ్యాఖ్యలు చేస్తూ.. గొడవలు సృష్టించే ప్రయత్నం చేస్తున్నారని ఫైర్ అయ్యారు.ఇలాంటి విద్వేషకర వ్యాఖ్యలు చేసే ఎంత మందిపై కోర్టు ధిక్కరణ చర్యలు చేపట్టగలమని ధర్మాసనం ప్రశ్నించింది.వారిపై, సామాజిక వర్గాలపై విద్వేష వ్యాఖ్యలు చేయబోమని ప్రజ లు ప్రమాణం చేస్తే బాగుంటుందని సుప్రీం అభిప్రాయం వ్యక్తం చేసింది. దివంగత ప్రధానులు జవహార్ లాల్ నెహ్రూ, అటల్ బిహారీ వాజ్ పేయి వంటి వారి ప్రసంగాలు ఎంతో హుందాగా ఉండేవని గుర్తు చేసింది. విద్వేష ప్రసంగాలపై త్వరగా రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోలేకపోతున్నాటని ఆగ్రహం వ్యక్తం చేసింది. అందుకే కోర్టులకు పని పడుతోందని వ్యాఖ్యానించింది. ఇలా రాష్ట్ర ప్రభుత్వాలు మౌనంగా ఉంటే.. దానికి అర్థం ఏంటని ప్రశ్నించింది.రాష్ట్రాలుఏమో కేంద్ర ప్రభుత్వానికి వర్తించవని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా అన్నారు.కేరళ, తమిళనాడుల్లో నేతల విద్వేష ప్రసంగాల ఉదంతాలను కూడా ఈ పిటిషన్ తో కలిపి విచారించాలని కోరారు. వాటికి సంబంధించిన వీడియో క్లిప్ ల ప్రదర్శనకు అనుమతించాలని కోరడంతో దీన్ని ఒక డ్రామాగా మార్చొద్దని ధర్మాసనం పేర్కొంది. దేనికైనా ఒక పద్ధతి ఉంటుందని సూచిం చింది. తాము వీడియో క్లిప్ లు చూడాలని పిటిషనర్లు భావిస్తే.. అదే విషయాన్ని పిటి షన్ లో చేర్చమని తెలిపింది. అలాగే విచారణను ఏప్రిల్ 28వ తేదీకి వాయిదా వేసింది.

## శ్రీరామనవమి వేడుకల్లో అపశ్రుతి.. ఎగిసిపడుతున్న మంటలు!



పశ్చిమగోదావరి: తెలుగు రాష్ట్రాల్లో శ్రీరామనవమి వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. కాగా, పశ్చిమ గోదావరిలో జరగుతున్న వేడుకల్లో అపశ్రుతి చోటుచేసుకుంది.వేడుకలు జరుగుతున్న వేణుగోపాలస్వామి ఆలయ ప్రాంగణంలో అగ్ని ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో చలువ పందిళ్లు అగ్నికి ఆహుతయ్యాయి.వివరాల ప్రకారం.. తణుకు మండలం దువ్వ గ్రామంలో ఉన్న వేణుగోపాలస్వామి ఆలయంలో శ్రీరామనవమి వేడుకలు జరుగుతున్నాయి. వేడుకల? సందర్భంగా ఆలయ ప్రాంగణంలో ఒక్కసారిగా మంటలు చేలరేగాయి. మంటల కారణంగా చలువ పందిళ్లు అగ్నికి ఆహుతయ్యాయి. పెద్ద ఎత్తున మంటలు ఎగిసిపడుతున్నాయి. అయితే, షార్ట్ సర్క్యూట్ కారణంగానే ఈ ప్రమాదం జరిగినట్టు అనుమానిస్తున్నారు. ఈ ప్రమాద ఘటనపై మరింత సమాచారం తెలియాల్సి ఉంది.



# ముగిసిన ఢిల్లీ పర్యటన..


### కేంద్ర మంత్రులతో సీఎం జగన్ చర్చించిన కీలకాంశాలు





ఢిల్లీ/తాడేపల్లి: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఢిల్లీ పర్యటన ముగిసింది. తన పర్యటనలో భాగంగా ఏపీకి సంబంధించిన పలు కీలకాంశాలను కేంద్రానికి నివేదించారు సీఎం జగన్.కేంద్రం మంత్రులతో.. రాష్ట్ర అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలతో పాటు ఏపీకీ రావాల్సిన నిధులు, బకాయిలపైనా ఆయన చర్చించారు.ఢిల్లీ పర్యటనలో భాగంగా.. ఇవాళ ఉదయం కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌తో ముఖ్యమంత్రి సీఎం జగన్ భేటీ అయ్యారు. రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. ఉపాధి హామీ పనులకు సంబంధించి రాష్ట్రానికి ఇవ్వాల్సిన బకాయిలు సుమారు రూ.2,500 కోట్లు ఉన్నాయని, వెంటనే ఈ డబ్బు మంజూరుచేయాలి. రాష్ట్రంలో ప్రస్తుత ప్రభుత్వం తప్పులేకున్నా... రుణాలపై కేంద్రం ఆంక్షలు విధించడం సరికాదు. నిబంధనల ప్రకారం ఇచ్చిన రుణ పరిమితిని కూడా తగ్గించారు. 2021-22లో రూ.42,472 కోట్ల రుణపరిమితి కల్పించి, తదుపరి కాలంలో రూ.17,923 కోట్లుకు కుదించారు. ఈ విషయంలో సానుకూల నిర్ణయం తీసుకోవాలి.తెలంగాణ డిస్కంల నుంచి ఏపీ జెన్‌కోకు, 2014 జూన్ నుంచి 2017 జూన్ వరకూ సరఫరాచేసిన విద్యుత్తుకు సంబంధించి రూ.7,058 కోట్లు రావాల్సి ఉంది. బకాయిలను వెంటనే ఇప్పించండి. 2014-15 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రాష్ట్రానికి రీసోర్స్ గ్యాప్ ఫండింగ్ కింద రూ.36,625 కోట్ల రూపాయలు పెండింగులో ఉన్నాయి. వాటిని విడుదల చేసేలా చూడండి.పోలవరం ప్రాజెక్టును వేగవంతంగా ముందుకు తీసుకెళ్లడానికి అడహాక్ గా రూ.10 వేల కోట్లు మంజూరుచేయాలి. పోలవరం డయాఫ్రమ్‌వాల్ ప్రాంతంలో చేయాల్సిన మరమ్మతులకు దాదాపు రూ.2, 020 కోట్లు ఖర్చు చేయాల్సి ఉంంది. వెంటనే ఈ నిధులు విడుదల చేయాలి.పోలవరం ప్రాజెక్టు కోసం రాష్ట్ర ప్రభుత్వం సొంతంగా ఖర్చుచేసిన రూ.2, 600.74 కోట్ల రూపాయలను సత్వరమే రీయింబర్స్ అయ్యేలా చూడాలి. పోలవరం ప్రాజెక్టు అంచనాలను టెక్నికల్‌అడ్వయిజరీ కమిటీ రూ. 55,548 కోట్లుగా నిర్ధారించింది. దీనికి వెంటనే ఆమోదం తెలపాలి. దీంతోపాటు ప్రాజెక్టుకు సంబంధించి ఇతరత్రా అంశాలను చర్చించారు సీఎం జగన్. రాష్ట్ర విభజన సమయంలో ప్రత్యేక హోదా ఇస్తామంటూ పార్లమెంటు సాక్షిగా కేంద్రం హామీ ఇచ్చిందని, రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వాలని విజ్ఞప్తి చేశారాయన.ఢిల్లీ పర్యటనలో భాగంగా.. బుధవారం సాయంత్రం కేంద్ర హోం మంత్రి అమిత్ షాతో ఏపీ సీఎం వైఎస్ జగన్ అరగంట భేటీ అయ్యారు. రాష్ట్ర అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై చర్చించారాయన. విభజన కారణంగా ఆంధ్రప్రదేశ్ తీవ్రంగానష్టపోయింది. అశాస్త్రీయ విభజన కారణంగా ఆర్థికంగా, ఆదాయాలపరంగా, అభివృద్ధి పరంగా, వివిధ సంస్థల రూపేణా తీవ్ర నష్టం వాటిల్లింది. ఈ నష్టాలనుంచి కాపాడేందుకు, రక్షణగా విభజన చట్టంలో కేంద్రం ప్రభుత్వం కొన్ని హామీలు ఇచ్చింది. పార్లమెంటు సాక్షిగా కూడా ఈ హామీలు ఇచ్చింది. విభజన జరిగి 9 సంవత్సరాలు కావొస్తున్నా రాష్ట్రానికి నెరవేర్చాల్సిన అనేక అంశాలు ఇంకా పెండింగులోనే ఉన్నాయి. వీటిపై వెంటనే దృష్టిసారించమని కోరుతున్నాను. పోలవరం ప్రాజెక్టును మరింత వేగవంతంగా ముందుకు తీసుకెళ్లడానికి అడహాక్‌గా రూ.10 వేల కోట్లు మంజూరుచేయాలని కోరుతున్నాను.అనూహ్య వరదల కారణంగా డయాఫ్రంవాల్ దెబ్బతింది. డయాఫ్రంవాల్ ప్రాంతంలో చేయాల్సిన మరమ్మతులకు దాదాపు రూ.2020 కోట్లు ఖర్చు చేయాల్సి ఉందని డీడీఆర్‌ఎంపీ అంచనావేసింది. ఈ డబ్బును వెంటనే విడుదలచేయాలని విజ్ఞప్తిచేస్తున్నాను. రాష్ట్ర ప్రభుత్వం సొంత ఖజానానుంచి రూ.2,600.74 కోట్ల రూపాయలు ఖర్చుచేసింది. గడచిన రెండు సంవత్సరాలుగా ఇవి పెండింగ్‌లో ఉన్నాయి. వెంటనే చెల్లించాల్సిందిగా ఆదేశాలు ఇవ్వాలని కోరుతున్నాను.పోలవరం ప్రాజెక్టు అంచనాలను టెక్నికల్ అడ్వయిజరీ కమిటీ రూ. 55,548 కోట్లుగా నిర్ధారించింది. ఈ మొత్తానికి వెంటనే ఆమోదం తెలపాలని కోరుతున్నాను. తాగునీటి సరఫరా అంశాన్నికూడా పోలవరం ప్రాజెక్టులో భాగంగా చూడాలని, ప్రాజెక్టు నిర్మాణంలో కాంపొనెంట్‌వారీ నిబంధనలను సడలించాలని విజ్ఞప్తిచేస్తున్నాను. పోలవరం ప్రాజెక్టు ముంపు బాధితులకు వీలైనంత త్వరగా పరిహారం ఇవ్వాలని విజ్ఞప్తిచేస్తున్నాను. డీబీటీ పద్ధతిలో ముంపు బాధితులకు ఈ సహాయం అదిస్తే జాప్యాన్ని నివారించవచ్చు.2014-15 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రాష్ట్రానికి రీసోర్స్ గ్యాప్ ఫండింగ్ కింద రూ.36,625 కోట్ల రూపాయలు పెండింగులో ఉన్నాయి. ఈ నిధులను వెంటనే విడుదలయ్యేలా చూడాలని కోరుతున్నారు.రాష్ట్రంలో ఈ ప్రభుత్వం కన్నా ముందున్న ప్రభుత్వం పరిమితికి మించి రుణాలు వాడుకుందన్న కారణంతో ఇప్పుడు ఆంక్షలు విధించారు. నిబంధనలు ప్రకారం ఇచ్చిన రుణ పరిమితిని కూడా తగ్గించారు. 2021-22లో రూ.42,472 కోట్ల రుణపరిమితి కల్పించి, తదుపరి కాలంలో రూ.17,923 కోట్లు తగ్గించారు. ఈ విషయంలో సానుకూల నిర్ణయం తీసుకోవాల్సిందిగా విజ్ఞప్తిచేస్తున్నాను. తెలంగాణ డిస్కంల నుంచి ఏపీ జెన్‌కోకు, 2014 జూన్ నుంచి 2017 జూన్ వరకూ సరఫరాచేసిన విద్యుత్తుకు సంబంధించి రూ.7,058 కోట్లు రావాల్సి ఉంది. వీటిని వెంటనే ఇప్పించాల్సిందిగా కోరుతున్నాను.

## రాహుల్ గాంధీపై దావా వేస్తా: లలిత్ మోదీ



'మోదీ ఇంటిపేరు'పై చేసిన వ్యాఖ్యల కారణంగా తీవ్ర విమర్శలు ఎదుర్కొంటున్నారు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఇలాంటి సమయంలో ఐపీఎల్ సృష్టికర్త, మాజీ ఛైర్మన్ లలిత్ మోదీ. రాహుల్‌పై తీవ్రంగా మండిపడ్డారు. మనీ లాండరింగ్ వ్యవహారంలో తనపై అసత్య, నిరాధార ఆరోపణలు చేస్తున్నందుకు గానూ.. కాంగ్రెస్ నేతపై పరువు నష్టం దావా వేస్తానని హెచ్చరించారు. ఈ మేరకు వరుస ట్వీట్లలో రాహుల్, కాంగ్రెస్ పార్టీపై విమర్శలు గుప్పించారు."నేను న్యాయప్రక్రియ నుంచి పారిపోయానని గాంధీ మద్దతుదారులు, ప్రతి ఒక్కరూ ఆరోపణలు చేస్తున్నారు. ఎందుకు? ఎలా? రాహుల్ గాంధీ మాదిరిగా.. ఇప్పటివరకు నేను ఏ కేసులోనైనా దోషిగా తేలానా? ప్రతిపక్ష నేతలు ఏమీ చేయలేక.. ఇలా అసత్య ప్రచారాలకు పాల్పడుతున్నారని ఇప్పుడు సామాన్య పౌరుడు కూడా అర్థం చేసుకోగలడు. ఈ తప్పుడు ఆరోపణలకు గానూ రాహుల్‌కు వ్యతిరేకంగా నేను యూకే కోర్టుకు వెళ్లాలని నిర్ణయించుకున్నా. అప్పుడైనా ఒక బలమైన ఆధారాలతో రావాల్సి ఉంటుంది. అవి దొరక్క ఆయన ఫూల్ అవడం నేను చూస్తాను. గాంధీ కుటుంబానికి సన్నిహితులైన చాలా మంది కాంగ్రెస్ నేతలకు విదేశాల్లో ఆస్తులున్నాయి. మీ అసత్య ఆరోపణలతో ప్రజలను తెలివితక్కువ వారిని చేయలేరు. తాము మాత్రమే ఈ దేశాన్ని పాలించేందుకు అర్హులమని గాంధీ కుటుంబం భావిస్తోంది" అని లలిత్ మోదీ ఘాటు విమర్శలు చేశారు."గత 15 ఏళ్లలోనే నేను ఒక్క రూపాయి కూడా అక్రమంగా దోచుకున్నట్లు ఇప్పటివరకు నిరూపణ కాలేదు. అయితే, నిజమేంటంటే.. దాదాపు 100 బిలియన్ డాలర్లను సంపాదించి పెట్టిన ప్రపంచంలోనే అత్యంత గొప్ప క్రీడా టోర్నీని నేను నిర్వహించాను. 1950 నుంచి కాంగ్రెస్ ఈ దేశం కోసం చేసిన దానికంటే ఎక్కువగా, వారి ఊహలకు మించి 'మోదీ' కుటుంబం (ఆ కమ్యూనిటీని ఉద్దేశిస్తూ) ఈ దేశానికి సేవ చేసింది. నేను కూడా ఎక్కువే చేశాను. నేను దోచుకున్నానని మీరు ఎంత అరిచినా లాభం లేదు. ఇక భారత్‌లో కఠినమైన చట్టాలను తీసుకొచ్చిన తర్వాత నేను తప్పకుండా తిరిగొస్తాను" అని మోదీ రాసుకొచ్చారుఐపీఎల్ కుంభకోణంలో లలిత్ మోదీ ఆరోపణలు ఎదుర్కొంటున్న విషయం తెలిసిందే. అటు పంజాబ్ నేషనల్ బ్యాంక్ కుంభకోణంలో నీరవ్ మోదీ నిందితుడిగా ఉన్నారు. ఈ స్కామ్‌లపై గత కొన్నేళ్లుగా కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీస్తున్న రాహుల్.. ఆ మధ్య 'దొంగలందరికీ మోదీ అనే ఇంటిపేరే ఎందుకు ఉంటుందో? అని వ్యాఖ్యలు చేశారు. ఇవి కాస్త తీవ్ర దుమారం రేపడంతో పాటు ఆయనపై పరువునష్టం కేసు కూడా దాఖలైంది. ఈ కేసులో ఇటీవల విచారణ జరిపిన సూరత్ కోర్టు.. రాహుల్‌కు రెండేళ్ల జైలు శిక్ష విధించింది. దీంతో ఆయనపై లోక్‌సభ సచివాలయం అనర్హత వేటు వేసింది. ఈ పరిణామాల నేపథ్యంలో రాహుల్‌పై లలిత్ మోదీ విమర్శలు చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది.

## బొలెరో వాహనాన్ని ఢీకొట్టిన దురంతో ఎక్స్‌ప్రెస్..

భీమడోలు: ఏలూరు జిల్లా భీమడోలు వద్ద బొలెరో వాహనాన్ని దురంతో ఎక్స్‌ప్రెస్ ఢీకొట్టింది. రైలు సికింద్రాబాద్ నుంచి విశాఖపట్నం వెళ్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది.గురువారం వేకువజామున సుమారు 3 గంటల సమయంలో ఈ ప్రమాదం జరిగింది. దీంతో 6 గంటలకు పైగా రైలు నిలిచిపోయింది. ఆ తర్వాత విశాఖకు బయల్దేరి వెళ్లింది.దురంతో ఎక్స్‌ప్రెస్ వస్తుండటంతో భీమడోలు జంక్షన్ వద్ద రైల్వే గేటును సిబ్బంది వేశారు. అదే సమయంలో బొలెరోలో వచ్చిన కొంతమంది వ్యక్తులు వాహనంతో రైల్వే గేటును ఢీకొట్టి వెళ్లే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో ఆ వాహనం రైల్వే ట్రాక్‌పైకి వచ్చింది. అదే సమయంలో దురంతో ఎక్స్‌ప్రెస్ సమీపించడంతో సదరు వ్యక్తులు బొలెరో వాహనాన్ని అక్కడే వదిలేసి పారిపోయారు. రైలు ఢీకొనడంతో ఆ వాహనం ధ్వంసమైంది.రైలు ఇంజిన్ ముందు భాగం దెబ్బతినడంతో సిబ్బంది మరో ఇంజిన్‌ను అమర్చారు. దురంతో ఎక్స్‌ప్రెస్ నిలిచిపోవడంతో అందులోని ప్రయాణికులు కొందరు ప్రత్యామ్నాయ మార్గాల్లో బయల్దేరి వెళ్లారు. ఈ ఘటనపై రైల్వేపోలీసులు విచారణ చేపట్టారు. బొలెరో వాహనంలో వచ్చినవాళ్లు దొంగలా? పారిపోయే క్రమంలో గేటును ఢీకొట్టారా? లేదా మరేదైనా కారణమా? అనే కోణంలో రైల్వే పోలీసులు విచారణ చేపట్టారు.



## రాష్ట్ర చరిత్రలోనే ఇవాళ అత్యధిక విద్యుత్ వినియోగం నమోదు

హైదరాబాద్ : రాష్ట్ర చరిత్రలోనే ఇవాళ అత్యధిక విద్యుత్ వినియోగం నమోదైంది. ఉదయం 11:01 గంటలకు గరిష్ఠంగా 15,497 మెగావాట్ల డిమాండ్ నమోదైంది. ఈ నెల ప్రారంభం నుంచే 15 వేల మెగావాట్ల విద్యుత్( వినియోగం నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. విద్యుత్ వినియోగంలో దక్షిణాదిన తెలంగాణ రెండో స్థానంలో ఉంది.మార్చి 14వ తేదీన ఉదయం 10:03 గంటలకు 15,062 మెగావాట్ల విద్యుత్ వినియోగం జరిగినట్లు ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ ప్రభాకర్ రావు వెల్లడించిన సంగతి తెలిసిందే. సరిగ్గా రెండు వారాల తర్వాత గురువారం ఉదయం 11:01 గంటలకు 15,497 మెగావాట్ల విద్యుత్ వినియోగం నమోదైంది.రాష్ట్రంలో రోజురోజుకీ విద్యుత్ వినియోగం పెరుగుతోందని అధికారులు పేర్కొన్నారు. సాగు విస్తీర్ణం పెరగడంతో పాటు పారిశ్రామిక అవసరాలు పెరగడంతో విద్యుత్ డిమాండ్ ఎక్కువైందన్నారు. రాష్ట్రంలో మొత్తం విద్యుత్ డిమాండ్‌లో 37 శాతం వ్యవసాయ రంగానికే వినియోగించబడుతోందని పేర్కొన్నారు. దేశంలో వ్యవసాయ రంగానికి అత్యధిక విద్యుత్ వినియోగం చేస్తున్న రాష్ట్రం తెలంగాణనే అని స్పష్టం చేశారు.గత సంవత్సరం మార్చి నెలలో అత్యధికంగా 14,160 మెగా వాట్ల విద్యుత్ వినియోగం జరిగింది. గత డిసెంబర్‌లో ఈ రికార్డును అధిగమిస్తూ 14,750 మెగావాట్ల ఫీక్ విద్యుత్ వినియోగం జరిగింది. కాగా తాజాగా గురువారం 15,497 మెగావాట్ల విద్యుత్ వినియోగమైంది.



# సంపాదకీయం

శుక్రవారం 31-03-2023

## మళ్లీ టెన్షన్... టెన్షన్

కరోనా రోగుల సంఖ్య మళ్లీ పెరుగుతోంది. కాబట్టి వైరస్ నుండి రక్షణ పొందడం చాలా ముఖ్యం. రెండు డోస్‌ల టీకా తర్వాత బూస్టర్ డోస్ తీసుకోవడం మంచిది. అయితే బూస్టర్ డోస్ కు సంబంధించిన పని మాత్రం ఇంకా పూర్తికాలేదు. మరో మోతాదు అనివార్యమని ప్రపంచ ఆరోగ్య సంస్థ తెలిపింది. దేశవ్యాప్తంగా కరోనా ఇన్ఫెక్షన్ మరోసారి ఊపందుకుంది. గత కొద్ది రోజులుగా కరోనా సోకిన వారి సంఖ్య క్రమంగా పెరుగుతోంది. ఇప్పుడు మళ్లీ భారత్‌లో కరోనా భయం మొదలైంది. గత 24 గంటల్లో రికార్డు స్థాయిలో కరోనా ఇన్ఫెక్షన్ కేసులు నమోదయ్యాయి.మరోసారి కరోనా మహమ్మారి విజృంభిస్తోంది. భారత్‌లో ఒకే ఒక్కరోజులో 2,151 కొత్త కేసులు నమోదవడం జనాన్ని హడలెత్తిస్తోంది. గత ఐదునెలల్లో ఇదే హైయ్యెస్ట్ నంబర్ అని కేంద్ర వైద్య ఆరోగ్యశాఖ స్పష్టం చేసింది. గత ఏడాది అక్టోబర్ 28న 2,208 కేసులు నమోదవగా?మళ్ళీ ఈ రోజు అత్యధికంగా కోవిడ్ కేసులు నమోదయ్యాయి. ఇక యాక్టివ్ కేసుల సంఖ్య 11,903కి చేరినట్టు వైద్యారోగ్యశాఖ వెల్లడించింది. మరోవైపు ఢిల్లీని కోవిడ్ అల్లాడిస్తోంది. ఢిల్లీలో గడిచిన 24 గంటల్లో కరోనాతో ఇద్దరు మృత్యువాతపడ్డారు. తాజాగా 300 కోవిడ్ కేసులు నమోదయ్యాయి. ఢిల్లీలో కోవిడ్ పాజిటివిటీ రేటు13.89 శాతానికి చేరింది. మహారాష్ట్రలో ముగ్గురు, కర్నాటకలో ఒకరు, కేరళలో ముగ్గురు వ్యక్తులను కోవిడ్ మహమ్మారి కబళించింది?వీరంతా మృత్యువాత పడ్డారు. భారత్ లో కరోనా కేసులు భారీగా పెరుగుతున్నాయి. ప్రతి రోజూ కేసుల సంఖ్య పెరుగుతుండటం ఆందోళన కల్గిస్తుంది. గత 24 గంటల్లో 2,151 కరోనా పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. ఏడుగురు కరోనా కారణంగా మరణించారని కేంద్ర వైద్య ఆరోగ్య శాఖ అధికారులు వెల్లడించారు. మృతుల సంఖ్య? మృతుల సంఖ్య కూడా పెరుగుతుండటం ఆందోళన కల్గిస్తుంది. కోవిడ్ నిబంధనలను పాటించాలంటూ ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలను అప్రమత్తం చేసింది. ప్రస్తుతం దేశంలో 11,903 యాక్టివ్ కేసులున్నాయని కేంద్ర వైద్య ఆరోగ్య శాఖ తెలిపింది. ఐదు నెలల్లో ఈరోజు అత్యధికంగా కేసులు నమోదయ్యాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, కోవిడ్ నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ కరోనా వ్యాక్సిన్ కోసం తన సిఫార్సులను మార్చింది. కరోనా ఇన్‌ఫెక్షన్‌కు గురయ్యే అవకాశం ఉన్న వ్యక్తులు బూస్టర్ డోస్ తీసుకున్న 12 నెలల తర్వాత అదనపు మోతాదు తీసుకోవాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ సూచించింది. ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకారం, వృద్ధులు వైరస్ బారిన పడే ప్రమాదం ఎక్కువగా ఉంటుంది. అదేవిధంగా, చిన్న పిల్లలు కూడా వ్యాధి బారిన పడే అవకాశం ఉంది. పెద్దలు, పిల్లలకు బూస్టర్ మోతాదుల తర్వాత 6, 12 నెలల తర్వాత అదనపు టీకాలు వేయాలని చిఊూ పేర్కొంది.ఆరోగ్యవంతమైన పిల్లలు మరియు కౌమారదశలో ఉన్నవారు వ్యాధి బారిన పడే అవకాశం తక్కువగా ఉందని ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదించింది. ఆరోగ్యవంతమైన పిల్లలు మరియు కౌమారదశకు టీకాలు వేసే ముందు వ్యాధి భారాన్ని పరిగణించాలని ఏజెన్సీ తెలిపింది. అంటువ్యాధుల ప్రమాదం ఎక్కువగా ఉన్నవారికి ముందుగా టీకాలు వేయాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ చెబుతోంది.ప్రపంచంలోని వివిధ దేశాలు తమ ప్రజలకు టీకాలు వేయడానికి వారి స్వంత పద్ధతులను అవలంబిస్తాయి. జఐ మరియు కెనడా వంటి సంపన్న దేశాలు వైరస్ ద్వారా ఎక్కువగా ప్రభావితమైన వ్యక్తులకు చివరి మోతాదు తర్వాత ఆరు నెలల తర్వాత బూస్టర్ మోతాదులను ఇవ్వడం ప్రారంభించాయి. ఐదేళ్లలోపు పిల్లల కోసం ఫైజర్ ఓమిక్రాన్ బూస్టర్ షాట్‌ను అమెరికా ఆమోదించింది. ఇప్పటికే మూడు డోసులు తీసుకున్న పిల్లలు ఇప్పుడు నాలుగో డోస్ తీసుకోవచ్చని కంపెనీ తెలిపింది.ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకారం, కరోనా వ్యాక్సిన్ యొక్క ప్రారంభ రెండు డోసులు, ఒక బూస్టర్ డోస్ తర్వాత, కరోనా ప్రమాదంలో ఉన్న వ్యక్తులకు అదనపు బూస్టర్ వ్యాక్సిన్‌లను క్రమం తప్పకుండా వర్తించాల్సిన అవసరం లేదు. ప్రపంచ ఆరోగ్య సంస్థ ఈ నోటిఫికేషన్‌తో ప్రజల్లో మళ్లీ ఆందోళన మొదలైంది. ఇప్పటికే మూడు డోస్‌లు తీసుకున్న వ్యక్తులు నాల్గవ డోస్ అవసరమా అని ప్రశ్నించడం ప్రారంభించారు.కరోనా తీవ్రతను తగ్గించడానికి బూస్టర్ డోస్ సరిపోతుంది. చాలా మంది నిపుణులు బూస్టర్ డోస్ అవసరమని అభిప్రాయపడ్డారు. బూస్టర్ డోస్ కరోనా ఇన్ఫెక్షన్ ప్రమాదాన్ని తగ్గిస్తుంది. వ్యాక్సిన్ తీసుకోని వారికి త్వరగా వ్యాధి సోకడమే కాకుండా ఇన్‌ఫెక్షన్ వ్యాపిస్తుందని నిపుణులు తెలిపారు.

# ఎవరితో... ఆ నలుగురు

విజయవాడ, మార్చి 30, ఆ నలుగురి దారెటు..? వేరే పార్టీలో టిక్కెట్ కన్ఫామ్ అయ్యిందా..? మరేదైనా హామీ వచ్చిందా..? ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాల అనంతరం ఈ విషయాలు ఏపీలో చర్చనీయాంశంగా మారాయి. ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైసీపీ రెబెల్స్‌తో పాటు..ఇద్దరు వైసీపీ ఎమ్మెల్యేలే టీడీపీకి అనుకూలంగా ఓటేశారు. దీంతో..ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి సంచలన నిర్ణయం తీసుకున్నారు. పార్టీ లైన్ ను క్రాస్ చేసి ఓటు వేసిన ఆ నలుగురు ఎమ్మెల్యేలను సస్పెండ్ చేశారు. దీనిని జీర్ణించుకులేని వైసీపీ శ్రేణులు.. నలుగురిపై భగ్గుమంటున్నాయి. ఈ తరుణంలో ఎప్పుడు ఏం జరగు?తుందోనని టెన్షన్ నెలకొంది.ఇంతవరకు ఓకే..మరి..ఇప్పుడు ఆ నలుగురు ఎమ్మెల్యేల దారెటు..?ఇదే క్యూరియాసిటీ ఏపీ మొత్తం కనిపిస్తోంది. వెంకటగిరి ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి, ఉదయగిరి ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, తాడికొండ ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవి పొలిటికల్ ఫ్యూచర్ ఏంటి.. ఏ హామీతో వాళ్లు క్రాస్ ఓటింగ్‌కు తెగించారు. ఇదే ఇప్పుడు అధికార ప్రతిపక్ష పార్టీలో డిస్కస్ జరుగుతున్న పాయింట్.ప్రస్తుతం ఉండవల్లి శ్రీదేవి మాత్రం హైదరాబాద్‌కు మకాం మార్చారు. తనకు ప్రాణహాని ఉందని, అందుకే హైదరాబాద్ వచ్చినట్లు చెబుతున్నారు. ఒక్క శ్రీదేవే కాదు.. మిగతా ఎమ్మెల్యేలు కూడా వైసీపీపై మనసులో మాట బయటపెడుతున్నారు. మేకపాటి చంద్రశేఖర్ రెడ్డి అయితే..సస్పెండ్ చేసినందుకు చాలా రిలాక్స్‌గా ఉంటున్నానన్నారు.ఆనం రామనారాయణ రెడ్డి కూడా వైసీపీకి దూరంగా..టీడీపీకి దగ్గరగా వెళ్లారు. కోటం రెడ్డి శ్రీధర్ రెడ్డి కూడా కాకమీదున్నారు. అయితే..వీళ్లంతా ప్రస్తుతం తమతమ నియోజకవర్గాల్లో ముందుమాదిరిగా తిరగ్గలరా.. ప్రజలతో మమేకం కాగలరా.. అధిష్టానాన్ని ఎదిరించి..సొంత అడ్డాల్లో రాణించగలరా..మళ్లీ పాత ఛరిష్మాతో కొత్త ఖలేజా చూపించగలరా.. స్థానికంగా ఎలాంటి పరిస్థితిని ఎదుర్కొనబోతున్నారు. ఇప్పటికే అన్ని ప్రాంతాల్లో వీళ్లకు స్థానిక వైసీపీ నేతల నుంచి తీవ్ర నిరసనలు ఎదురవుతున్నాయి.ఉదయగిరిలో మేకపాటి చిత్రపటానికి పాడగట్టి శవయాత్ర చేశారు. తుళ్లూరులో శ్రీదేవి దిష్టిబొమ్మ దగ్ధం చేశారు. అటు ఆనం.. ఇటు కోటం రెడ్డికీ నిరసనల సెగలు తప్పడం లేదు.ఎన్నికలకు ఏడాది సమయం ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో అధికార పార్టీతో ఢీ కొని..సొంతంగా ఇమేజ్ పెంచుకోగలరా.. ఎవరి వాదన ఎలా ఉన్నా.. ఈ నలుగురు ఎమ్మెల్యేలు ఎన్నికల ముందు లేదా ఒకటి రెండు నెలల తరువాత.. టీడీపీ కండువా కప్పుకుంటారనే ప్రచారం జరుగుతోంది. కొంతకాలంగా ఈ నలుగురు ఎమ్మెల్యేలు వైసీపీ అధిష్టానంపై చాలా అసంతృప్తితో ఉన్నారు. సమయం దొరికినప్పుడల్లా పార్టీపై ప్రత్యక్షంగాను, పరోక్షంగానూ విమర్శలు చేస్తున్నారు. సెటైర్లు వేస్తూ వచ్చారు..కొన్నిసార్లు సొంత పార్టీ నాయకులపై విమర్శలు కూడా చేశారు. వీటన్నింటినీ గమనిస్తూ వచ్చిన అధిష్టానం అవకాశం కోసం ఎదురుచూసింది. ఇప్పుడు క్రాస్ ఓటింగ్ పేరుతో వారిపై చర్యలు తీసుకుంది.అయితే పార్టీ నుంచి సస్పెండ్ చేసినా వారు ఎమ్మెల్యేలుగానే కొసాగుతారు కాబట్టి.. ఇప్పట్లో ఉప ఎన్నిక లేనట్టే.. కానీ ఒకవేళ వారిలో ఎవరైనా అధికారికంగా టీడీపీలో చేరితే.. వైసీపీకి రాజీనామా చేయాల్సి వస్తుంది.. లేదా అలాంటి ఆధారాలేవైనా వైసీపీకి దొరికితే వారి పై అనర్హత వేటు వేయొచ్చు.. అప్పుడు మాత్రం ఉప ఎన్నిక తప్పని సరి.. అయితే వారు అధిష్టానికి వ్యతిరేకంగా పోరాడుతూనే ప్రస్తుతానికి ఏ పార్టీ కండువా కప్పుకునే అవకాశం ఉండదని అంటున్నారు. ఎంపీ రఘురామ కృష్ణంరాజులా.. రెబల్ ఎమ్మెల్యేలుగానే కొనసాగే అవకాశాలు కనిపిస్తున్నాయి.అయితే ఎన్నికల ముందు మాత్రం.. టీడీపీలో జాయిన్ అవుతారని.. ఇప్పటికే అందులో ఆనం రామనారాయణ రెడ్డి, కోటం రెడ్డి శ్రీధర్ రెడ్డిలకు టికెట్ హామీ కూడా వచ్చినట్టు సమాచారం. వారి సొంత నియోజకవర్గాల్లోనే మళ్లీ టీడీపీ తరపున పోటీ చేసే అవకాశం ఉంది. అలాగే మేకపాటి చంద్రశేఖర్ రెడ్డికి కూడా సీటుపై భరోసా లభించినట్టు టాక్.. అయితే ఎక్కడ అన్నది ఇంకా ఫైనల్ కావాల్సి ఉందని ఉదయగిరిలో చెప్పుకుంటున్నారు. మరో ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవికి మాత్రం ఎలాంటి హామీ ఇవ్వలేదని.. పార్టీలో మాత్రం సమున్నత స్థానం ఇస్తామని మాత్రమే చెప్పినట్టు ప్రచారం జరుగుతోంది.

# విజయనగరంలో రాజుల పోరు

విజయనగరం, మార్చి 30, విజయనగరం జిల్లా టీడీపీలో ఆసక్తికమైన చర్చ జరుగుతోంది. రాజుగారితో పెట్టుకుంటే ఇంతే సంగతులు.. దానికి ఈ ఇద్దరు ఎమ్మెల్యేలే నిదర్శనం అని చెవులు కొరికేసుకుంటున్నారు. ఆ ఇద్దరు మాజీ ఎమ్మెల్యేలలో ఒకరు మీసాల గీత.. ఇంకొకరు కొండపల్లి అప్పలనాయుడు అని ఉదహరిస్తున్నారు. వాస్తవానికి ఉమ్మడి జిల్లా టీడీపీలో పూసపాటి అశోక్‌గజపతిరాజుదే పెత్తనం. పార్టీ పెద్దలు అశోక్ మాటను కాదనే పరిస్థితి లేదు. ఆ విషయం తెలిసినా.. వివిధ సమీకరణాలను ముందు పెట్టి రాజకీయం చేయాలని చూస్తారు నాయకులు. అప్పటికి ఆ రాజకీయ ఎత్తుగడలు ఆసక్తి కలిగించినా.. చివరికి ఎవరిది పైచెయ్యి అవుతుందో తెలుగు తమ్ముళ్లకు తెలుసు.మీసాల గీత 2014లో విజయనగరం టీడీపీ ఎమ్మెల్యేగా గెలిచారు. ఆ సమయంలో విజయనగరం ఎంపీగా ఉన్నారు అశోక్‌గజపతి రాజు. ఇక అప్పలనాయుడు గజపతినగరం ఎమ్మెల్యే. అప్పలనాయుడుకు 2019లో తిరిగి పోటీ చేసే ఛాన్స్ దక్కినా.. గీత మాత్రం స్టాండ్ బై అయ్యారు. ఆ ఎన్నికల్లో అశోక్ గజపతిరాజు కుమార్తె అదితి గజపతిరాజు పోటీ చేసి ఓడిపోయారు. సిట్టింగ్ ఎమ్మెల్యేగా ఉన్న తనను కాదని కుమార్తెకు సీటు ఇప్పించుకున్నారని గీత రుసరుసలాడేవారు. క్రమంగా అశోక్‌తో గ్యాప్ రావడం.. కోటలో ఉన్న టీడీపీ ఆఫీసుకు వెళ్లకపోవడం చేసేవారు గీత. వన్ ఫైన్ మార్నింగ్ ఏకంగా విజయనగరంలో జిల్లా టీడీపీ ఆఫీసు అని కొత్త దుకాణం తెరిచారు. ఈ చర్యలపై పార్టీ పెద్దలకు ఫిర్యాదులు వెళ్లాయి. గీత ఆఫీసు ఏర్పాటు చేయడం వెనుక అప్పలనాయుడు సహకారం ఉందని పార్టీ కేడర్ సమాచారం. దీంతో గజపతినగరంలోనూ అశోక్ వేగంగా పావులు కదిపి మాజీ ఎమ్మెల్యే ప్రాధాన్యం తగ్గించినట్టు చెబుతున్నారు.గజపతినగరంలో అప్పలనాయుడు ప్లేస్‌లో కరణం శివరామకృష్ణను అశోక్‌గజపతిరాజు ప్రోత్సహిస్తున్నారని టాక్. దీంతో టీడీపీ ఇంఛార్జ్‌గా ఉన్న అప్పలనాయుడు కుతకుతలాడుతున్నారు. ఈ మధ్య కాలంలో ఇంఛార్జ్‌తో సంబంధం లేకుండా గజపతినగరంలో టీడీపీ కార్యక్రమాలు జరిగిపోతున్నాయి. అటు విజయనగరంలోనూ గీతను దగ్గరకు రానివ్వడం లేదు అశోక్ వర్గం. గజపతినగరంలో మాజీ ఎమ్మెల్యే పరిస్థితి ఇరకాటంలో పడింది. ఇటీవల ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం కోసం కొందరు టీడీపీ నేతలు జిల్లాకు వచ్చారు. ఆ ప్రచారంలో గీత, అప్పలనాయుడు పాల్గొన్నప్పటికీ.. వీళ్లతో మాట్లాడేందుకు పార్టీ నేతలు ఇబ్బంది పడ్డట్టు తెలుస్తోంది.

మీ దగ్గరకు వచ్చి ఎన్నికల గురించి మాట్లాడటం అశోక్‌గజపతిరాజుకు నచ్చడం లేదని ఈ ఇద్దరు మాజీ ఎమ్మెల్యేలకు ముఖం మీదే చెప్పినట్టు ప్రచారం జరుగుతోంది. మీకు మాకు తగువు లేదు.. కానీ మీకు రాజుగారికి విభేదాలు ఉన్నాయి.. వాటి మధ్యలోకి మమ్మల్ని లాగొద్దు అని ఆ నాయకులు చెప్పారని టాక్.తమకు పార్టీలో ఎదురవుతున్న పరిణామాలపై ఇద్దరు మాజీ ఎమ్మెల్యేలు గీత, అప్పలనాయుడులు అనుచరులతో సమావేశమై చర్చించారు. పార్టీ బలోపేతం కోసం పనిచేస్తుంటే.. ఈ అవమానాలు అవసరమా అని ప్రశ్నించినట్టు సమాచారం. విలువ.. గుర్తింపు లేని చోట ఏం పనిచేయగలం.. ఎన్నాళ్లు ప్రయాణించగలం అని మాజీ ఎమ్మెల్యేలు కుమిలిపోతున్నట్టు చర్చ జరుగుతోంది. మరి.. రాజుగారితో వీరిద్దరూ యుద్ధానికి దిగుతారో.. శక్తి చాలక సైలెంట్ అయిపోతారో చూడాలి.

# కుక్కల్లో కొత్త బ్రీడ్...

కర్నూలు, మార్చి 30, కర్నూలులోని పందికోన ఓ మారుమూల గ్రామం. నిజం చెప్పాలంటే అది ఓ అడవి?అక్కడ పెరిగే ఓ ప్రత్యేకమైన కుక్కలే పందికోన కుక్కలుగా ప్రసిద్ధి చెందాయి. గ్రామసింహాలే.. కానీ నిజంగా సింహాలను తలపించేలా ఉంటాయి. ఈ జాతి కుక్కలు ఇప్పుడు దేశవ్యాప్తంగా హల్‌చల్ చేస్తున్నాయి. ఒక కుక్క పిల్ల లేదా ఒక కుక్క ..ఏదైనా పర్వాలేదు.. ప్లీజ్ ఒకటి ఇవ్వండి డబ్బులు ఎంతైనా పర్వాలేదు? ఈ మాటలు ఎవరివో కాదు.. ఎన్నారైలు పోలీస్ అధికారులు ధనవంతుల నుంచి గ్రామస్తులకు వస్తున్న ఫోన్ కాల్స్?అక్కడి కుక్కలకు ఎందుకింత డిమాండ్? ఇదే ఇప్పుడు బిగ్ క్వశ్చన్.కర్నూలు జిల్లా పత్తికొండ మండలంలో ఉంది పందికోన.. పత్తికొండ కు దాదాపు పది కిలోమీటర్ల దూరంలో ఉంది. గ్రామ జనాభా 5000 పైనే ఉంటుంది. ఈ గ్రామానికి చుట్టూ పెద్ద అడవి. అందుకే గతంలో గ్రామంలోకి పులులు, చిరుతలు, ఎలుగుబంట్లు వచ్చి దాడి చేసేవి. రక్షణ లేని అటవీ ప్రాంతంలో ప్రజలకు అప్పుడు కుక్కలు సాయపడేవి. అడవి మృగాలు రావడం, కుక్కలతో కలిసి గ్రామస్తులు అడ్డుకోవడం పరిపాటిగా ఉండేది. ఓసారి చిరుత బి ఆడ కుక్క మధ్య సంపర్కం ద్వారా పిల్లలు పుట్టాయని, ఆ పిల్లలే నేటి పందికోన కుక్కల జాతి అని ఇంతింతై వటుడింతై అన్నట్లుగా పెరిగి పెద్దయి,ఒక ప్రత్యేకమైన లక్షణాలను కాలక్రమంలో సంతరించుకున్నాయని గ్రామస్తులు కథలు కథలుగా చెపుతారు.పందికోన జాతి కుక్కల అభివృద్ధితో ఈ శునకాలు చిరుతలు కాదు కదా ఎలాంటి అడవి జంతువులు వచ్చినా అడ్డుకొని చంపేస్తాయట. ఇక ఈ గ్రామాలకు అడవిజంతువుల బెడదపోయింది. ఇళ్ళల్లో దొంగతనాలు లేవు. చిరుతలు నక్కలు వచ్చి గొర్రె పిల్లను, పశువులను ఎత్తుకెళ్లి చంపేవి. నేడు ఆ పరిస్థితి లేదు. ఒక్కొక్క గొర్రెల కాపరి కనీసం అయిదు నుంచి 10 కుక్కలను పెంచుకుంటున్నాడు. నిశ్చింతగా ఆరుబయట నిద్రపోతున్నారు గొర్రెల కాపర్లు. గొర్రెల మందతో పాటు కుక్కలు కూడా ఉంటాయి. ఇది తెలిసినప్పటినుంచి గ్రామంలో దొంగతనాలు జరగలేదు. పందికోన కుక్కలకు గోర్లు , కళ్ళు, చెవులు ఇతరత్రా చిరుతలను పోలి ఉంటాయి. పౌరుషానికి విశ్వాసానికి ప్రతీక అనే అక్కడి గ్రామస్తులు గొప్పగా చెప్పుకుంటారు.ఈ మూడు లక్షణాలూ కలగలిస్తే ఈ ప్రత్యేకమైన పందికోన జాతి కుక్క అవుతుంది. వీటి సాహసం, రాజసం నేరస్తుల గుండెల్లో రైళ్ళు పరిగెట్టిస్తోంది. అలాంటి జాగిలాలు తోడుంటే ఎలాంటి వారైనా ధైర్యంగా ముందుకు దూసుకెళ్తారు. ఓసారి చిరుత, ఆడ కుక్క మధ్య సంపర్కం ద్వారా పిల్లలు పుట్టాయని, ఆ పిల్లలే నేటి పందికోన కుక్కల జాతి అన్నది ఆ గ్రామ ప్రజల



ఉమ్మడి మాట. నేర పరిశోధనలో ప్రస్తుతం ఈ కుక్కలు తమ తడాఖా చూపిస్తున్నాయి. ఈ పందికోన కుక్కల పౌరుషం విశ్వాసం గురించి దేశం నలుమూలల టాక్ టాప్‌రేపుతోంది. ముందుగా జిల్లా తో పాటు రాష్ట్రంలోని పోలీస్ అధికారులు తమ ఇళ్లలో పెంచుకుంటున్నారు అమెరికాలో సహా విదేశాలలో ఉన్న తెలుగు వారు ఇక్కడి కుక్కను తీసుకెళ్లి పెంచుకుంటున్నారు. దీంతో ఈ జాతి కుక్కలకు డిమాండ్ పెరిగింది. కొరత కూడా పెరిగింది.కర్నూలు జిల్లాలో లో పని చేసిన ఎస్పీలు కలెక్టర్ల సహా బదిలీపై వెళ్లిన అధికారులందరూ చాలామంది వెళ్లేటప్పుడు బహుమతిగా వచ్చిన ఇక్కడి కుక్కలను తీసుకెళ్లి పెంచుకుంటున్నారు. స్తోమతను బట్టి కొందరు ఉచితంగా ఇస్తే, మరికొందరు అమ్ముతున్నారు. మరి కొందరు కేవలం ఖర్చులకు మాత్రమే తీసుకుంటున్నారు. తనతో పాటు ఎంతో మంది పోలీసు అధికారులకు పందికోన కుక్కలను ఇచ్చానని, తాను కూడా పెంచుకుంటున్నానని డి.ఎస్.పి వెంకట్రామయ్య అంటున్నారు. ప్రత్యేక ఆహారం అక్కరలేదు. సాధారణ తిండి మాత్రమే వీటికి అవసరం. వీటి పెంపకం సులభం. ఇప్పుడు దేశదేశాల్లో తమ తడాఖా చూపిస్తున్నాయి.ఒక్క హైదరాబాదులోనే పందికోన జాతి కుక్కలు వందకు పైగా ఉన్నాయని గ్రామస్తులు అంటున్నారు. అడవులలో వేటకి వెళ్ళినప్పుడు పందికోన గ్రామం కుక్కల పౌరుషం చూస్తే ఎవరికైనా ఆశ్చర్యం వేస్తుంది . రియల్ గా ఉండే పౌరుషం ఆ సమయంలో బయట పడుతుంది. అమెరికాలో కుక్క లకు రన్నింగ్ నిర్వహించినప్పుడు పందికోన కుక్క గోల్డ్ మెడల్ సాధించిందంటే దాని పవరేంటో అర్థం చేసుకోవచ్చు.ప్రముఖ బ్యాడ్మింటన్ కోచ్ పుల్లెల గోపీచంద్ లాంటి ఎందరో ప్రముఖులు కుక్కను తీసుకెళ్లి పెంచుకుంటున్నారు. తెలంగాణ బిజెపి అధ్యక్షుడు బండి సంజయ్ అనుచరులు కూడా ఇక్కడికి ప్రత్యేకంగా వచ్చి తీసుకెళ్లారు.

# రేషన్ బియ్యం మాయాజాలం

అనంతపురం, మార్చి 30, ఉమ్మడి అనంతపురం జిల్లాలో మొత్తం 12.21 లక్షల రేషన్ కార్డులు, మూడు వేల చౌకధర దుకాణాలు ఉన్నాయి. నల్లమాడ మండలంలోని ఓ మిల్లులో అక్రమంగా తరలించిన రేషన్ బియ్యాన్ని నిల్వ చేస్తున్నారు. ఇప్పటికే అక్కడ పలుమార్లు బియ్యం పట్టుబడింది. మిల్లు యజమానిపై నల్లమాడ, ఓడీసీ, అమడగూరు, బాగేపల్లి పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదయ్యాయి. వీరికి రాజకీయ పలుకుబడి ఉండటంతో చర్యలు తీసుకోవడంలో అధికారులు వెనకాడుతున్నారనే విమర్శలు ఉన్నాయి. సదరు మిల్లులో నిల్వ చేసిన బియ్యాన్ని రాత్రి వేళలో కర్ణాటకకు తరలిస్తున్నట్లు ప్రచారం సాగుతోంది.రాయదుర్గం నియోజకవర్గంలో ఓ ప్రజాప్రతినిధి కుటుంబ సభ్యురాలి అండతో బియ్యం అక్రమ రవాణా సాగుతున్నట్లు ప్రచారంలో ఉంది. ఈ నియోజకవర్గానికి ఆనుకొని కర్ణాటక సరిహద్దుగా ఉండడంతో ఈ తంతు నిరంతరాయంగా కొనసాగుతున్నట్లు సమాచారం. కర్ణాటకకు చెందిన కొంతమంది వ్యాపారులు ఆమెకు నెలనెలా మామూళ్లు చెల్లిస్తున్నట్లు తెలిసింది. ఇక బొమ్మనహాళ్, కణేకల్లు, గుమ్మఘట్ట, డి. హీరేహాళ్ మండలాల నుంచి రేషన్ బియ్యాన్ని ఆటోల్లో రాయదుర్గం సమీపంలో నిల్వ చేస్తున్నారు. అక్కడి నుంచి రాత్రి వేళ లారీల ద్వారా బళ్లారిలోని మిల్లులకు తరలిస్తున్నారు. ఫిబ్రవరి నెల 11న డి.హీరేహాళ్ మండలం జాజరకల్ టోల్ ప్లాజా వద్ద 150 క్వింటాళ్ల బియ్యాన్ని పట్టుకున్నారు.అనంతపురం సాయినగర్ లోని ఓ డీలర్ ప్రతికార్డుపై బియ్యం తక్కువ తూకం వేసి ఇస్తున్నట్లు లబ్ధిదారులు ఆరోపిస్తున్నారు. దాని గురించి ఎవరైనా ప్రశ్నిస్తే దిక్కున్నచోట చెప్పుకోండి అంటూ దౌర్జన్యం చేస్తున్నారని వాపోతున్నారు. ఇతనికి స్థానిక వైసీపీ నాయకుల అండదండలు ఉండడంతో రెచ్చిపోతున్నట్లు తెలుస్తోంది. ఇలా పేదల నుంచి నొక్కేసిన బియ్యాన్ని కేజీ రూ.20 చొప్పున వ్యాపారులకు విక్రయిస్తున్నారు. ప్రతి నెలా రూ.50 వేలు జేబులో ఇలా అక్రమ దందా చేస్తున్నట్లు సమాచారం.కొందరు డీలర్లు లబ్ధిదారులకు బియ్యం బదులు నగదు ఇస్తున్నారు. మరి కొందరు ప్రతి కార్డుపై కేజీ నుంచి రెండు కేజీల బియ్యాన్ని కాజేస్తున్నారు. మరోవైపు ప్రతి నెలా పంపిణీ ప్రక్రియ ముగిసిన వెంటనే లబ్ధిదారుల వద్దకు వ్యాపారుల ఆటోలు వెళ్తున్నాయి. ప్రతి నెలా 15 వరకు రేషన్ బియ్యాన్ని సేకరిస్తున్నారు. కేజీకి రూ.10 వరకు ఇస్తున్నారు. ఆటోల ద్వారా సేకరించిన బియ్యాన్ని ఓ ప్రాంతంలో నిల్వ చేసి అక్కడి నుంచి లారీల్లో కర్ణాటకకు తరలిస్తున్నారు. ఒక్కలారీలో బియ్యం తరలిస్తే అన్ని ఖర్చులు పోను వ్యాపారికి రూ.50 వేలు మిగులుతోంది. ఇలా ఉమ్మడి జిల్లాలో రోజుకు రూ. కోటి మేర లావాదేవీలు జరుగుతున్నాయి.ఉమ్మడి జిల్లాలో సేకరిస్తున్న బియ్యాన్ని కర్ణాటకలోని తుముకూరు తరలిస్తున్నారు. ఉరవకొండ, రాయదుర్గం ప్రాంతాల నుంచి బళ్లారికి కొంతమేర తీసుకెళ్తున్నారు. తుముకూరులో పెద్ద ఎత్తున రైస్ మిల్లులు ఉండటం.. సన్న బియ్యం గా మార్చే యంత్రాలు అందుబాటులో ఉండటంతో యథేచ్ఛగా దందా సాగిస్తున్నారు. అక్కడి వ్యాపారులకు కేజీ రూ.25 చొప్పున విక్రయిస్తున్నారు. సన్న బియ్యంగా మార్చి ఆకర్షణీయమైన బస్తాల్లో నింపి.. హిందూపురం, అనంతపురం, గుంతకల్లు పట్టణాల్లో కొందరు వ్యాపారులకు విక్రయిస్తున్నారు. మడకశిర, రొళ్ల, అగళి, హిందూపురం ప్రాంతాల నుంచి కొందరు పెద్ద మొత్తంలో రేషన్ బియ్యాన్ని సేకరిస్తున్నారు. పావగడలోని మిల్లుల్లో వాటిని సన్నబియ్యంగా మారుస్తున్నారు. ఆకర్షణీయమైన బియ్యాన్ని తిరిగి బస్తాల్లో నింపి అనంతపురం పంపిస్తున్నారు. ఫిబ్రవరిలో మడకశిరలోని మధుగిరి మార్గంలో అక్రమంగా తరలిస్తున్న 165 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని విజిలెన్స్ అధికారులు పట్టుకున్నారు.

# కార్యకర్తల సంక్షేమమే ధ్యేయం

## మంత్రాలయం నియోజకవర్గం టీడీపీ సీనియర్ నాయకులు ఉలిగయ్య

కౌతాళం కార్యకర్తల సంక్షేమమే తమ ధ్యేయమని కార్యకర్తలకు అండగా ఎల్లప్పుడూ సహాయ సహకారాలు అందిస్తామని వాళ్ల క్షేమమే మాకు శ్రీరామరక్ష అని మాకు వెన్నంటూ ఉండే కార్యకర్తలు మాకు దేవుళ్ళతో సమానమని మంత్రాలయం నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు ఉలిగయ్య పేర్కొన్నారు. గురువారంకౌతాళం బజాజ్ షోరూం లో నూతన బైకులను ప్రారంభించరు. శ్రీరామనవమి సందర్భంగా కౌతాళంలో తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు కోత్తింటి ముకన్న కు 25000, కురువ రమేష్ 20,000 చొప్పున ఇద్దరికీ వేల 45000 రూపాయలను నూతన బైకు కొనుగోలుకు మంత్రాలయం తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు చూడి ఉలిగయ్య ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో వారు మాట్లాడుతూ కార్యకర్తల సంక్షేమమే తమకు ధ్యేయమని ప్రతి ఒక్క కార్యకర్తకు అన్నివేళలా సహాయ సహకారాలు అందిస్తామని... ఎవరు అధైర్య పడకండి 2024 లో వచ్చేది తెలుగుదేశం పార్టీ ప్రభుత్వమే అని ధీమా వ్యక్తం చేశారు.... ఈ కార్యక్రమంలో కౌతాళం సీనియర్ నాయకులు నీలకంఠ రెడ్డి, దేశాయి నరసింహా మూర్తి స్వామి, సేల్స్ ఎగ్జిక్యూటివ్ గొట్టయ్యా, కురువ శివకుమార్, కొత్తింటి ముకన్న కురువ రమేష్, సోమేశ్, టిఎన్ఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి చూడి రోహిత్, చూడి బసవరాజు , రౌడురు బుదుదొడ్డి, శ్రీరామ్, షేకు తదితరులు పాల్గొన్నారు.....

### వరుస పేలుళ్ల కుట్ర నిందితులపై ఛార్జీషీట్ దాఖలు -

హైదరాబాద్ 2022వ సంవత్సరం దసరా పర్వదినం రోజు హైదరాబాద్ లో వరుస పేలుళ్లకు పాల్పడాలని ఉగ్ర కుట్రకు పథకం వేసిన నిందితులపై ఎన్ఐఏ ఛార్జీషీటు దాఖలు చేసింది. ఈ కేసులో అరెస్ట్ అయిన ముగ్గురు నిందితులు మహ్మద్ అబ్దుల్ వాజిద్ అలియాస్ జాహెద్, సమీయుద్దీన్ అలియాస్ సమీ, మాజ్ హసన్ ఫరూఖ్ అలియాస్ మాజ్.. పాకిస్థాన్ కు చెందిన లష్కరేకే చెందిన సిద్ధిఖ్ బిన్ ఉస్మాన్ అలియాస్ అబూ హంజాలా, అబ్దుల్ మాజిద్ అలియాస్ చోటు ఇతర నేతలు, నిర్వాహకులతోనూ వీరికి సంబంధాలు ఉన్నాయని స్పష్టం చేసింది. వీరంతా కలిసి రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో ఉన్న రద్దీ ప్రాంతాల్లో పేలుళ్లతో విధ్వంసం సృష్టించాలని ప్లాన్ చేసినట్లు ప్రస్తావించింది. గతేడాది దసరా రోజున ఉగ్రకుట్ర పథకాన్ని హైదరాబాద్ టాస్క్ ఫోర్స్ పోలీసులు భగ్నం చేశారు.ఈ ఏడాది జనవరిలో కేసు ఎన్ఐఏకు బదిలీ అయింది. ఈ మేరకు దర్యాప్తు మొలు పెట్టిన సంస్థ బుధవారం నాంపల్లిలోని ఎన్ఐఏ న్యాయస్థానంలో అభియోగపత్రాన్ని దాఖలు చేసింది. అలాగే నిందితులు జాహెద్, సమీ, మాజ్ లు లష్కరే తోయిబాతో సంబంధాలు ఏర్పరుచుకున్నారని ఎన్ఐఏ తెలిపింది. అలాగే లష్కరే నేతలు ఫర్హతుల్లా ఘోరీ, సిద్దిఖ్ బిన్ ఉస్మాన్, అబ్దుల్ మాజిద్ లు పాకిస్థానీలు, ఘోరీ తన కుట్ర కోసం అంతర్జాలం ద్వారా జాహెద్ ను నిమమించి హవాలా ద్వారా నిధులు పంపాడు. లష్కరేలో మరింత మందిని నియమించి ఉగ్రవాద కార్యకలాపాలు వేగవంతం చేయాలని ఆదేశించాడు. దీని ప్రకారం... సమీ, మాజ్, మహ్మద కలీమ్ లను లష్కరే కోసం పని చేసేలా ఉసిగొల్పాడు. పేలుళ్ల కుట్రలో భాగంగా హైదరాబాద్ - నాగ్ పూర్ జాతీయ రహదారిలోని మనోహరాబాద్ గ్రామ సమీపంలో సెప్టెంబర్ 28వ తేదీన డెడ్ డ్రాప్ విధానంలో నాలుగు హ్యాండ్ గ్రనేడ్లను ఉంచారు.

## శ్రీరామనవమి పర్వదినం సందర్భంగా ప్రత్యేక పూజలు చేసిన మంత్రి గుమ్మనూరు జయరాం.

ఆలూరు మార్చి. విభారే న్యూస్:- రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం మరియు ఆయన సోదరులు శ్రీరామనవమి పర్వదినం సందర్భంగామంత్రాలయం శ్రీ రాఘవేంద్ర స్వామి ని దర్శించుకునేందుకు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర కార్మిక, ఉపాధి, శిక్షణ మరియు కర్మాగారాల శాఖ మంత్రి వర్యులు గుమ్మనూరు జయరాం, ఆయన సోదరుడు దేవరగట్టు ఆలయ కమిటీ చైర్మన్ గుమ్మనూరు శ్రీనివాసులు, నారాయణ స్వామి గురువారం ఉదయం మంత్రాలయం వెళ్లారు. అక్కడ వీరికి ముందుగా శ్రీ రాఘవేంద్ర స్వామి మఠం అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ముందుగా గ్రామ దేవత మంచాలమ్మను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం శ్రీ రాఘవేంద్ర స్వామి మూలబృందావనంకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వీరికి శ్రీ మఠం పీఠాధిపతి శ్రీ సుభుధేంద్ర తీర్థ స్వామి వారు శేష వస్త్రం కప్పి ఫలమంత్రాక్షితలతో ఆశీర్వాదించారు. పూజా కార్యక్రమం ముగిసిన తర్వాత రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం మాట్లాడుతూ రాబోవు శ్రీరామనవమి వరకు రాష్ట్ర ప్రజలు సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో పాడిపంటలతో శ్రీరామ చంద్రుని ఆశీర్వాదంతో ప్రతి ఒక్కరికి ఆయన దయాదక్షిణాలు ఉండాలని శ్రీ రాఘవేంద్ర స్వామిని కోరుకున్నానన్నారు.ఈ కార్యక్రమంలో మేనేజర్ ఎస్. కే. శ్రీనివాసరావు, అసిస్టెంట్ మేనేజర్ ఐపీ నరసింహ మూర్తి స్వామి, బిందు స్వామి, సీఐ శ్రీనివాసులు, ఎస్ఐ లు వేణుగోపాల్ రాజు, వెంకటేశ్వర్లు , మరియు ఆలయ సిబ్బంది నాయకులు ప్రజలు పాల్గొన్నారు

## పేద కుటుంబానికి నిత్యావసర సరుకులు

నంద్యాల మా ప్రతినిధి (విభారె న్యూస్) నంద్యాల జిల్లా మహనంది మండలం . గాజులపల్లి యందు గాఫార్ అనే ఒక నిరుపేద కుటుంబానికి సాయి యువ సేన వారు రెండు నెలల కు సరిపడు నిత్యావసర వస్తువుల గురువారం అందజేశారు. గపార్ అక్సిడెంట్ అయ్యి కాలు విరిగింది. సొంత ఇల్లు కూడా లేకుండా బాడుగ ఇంట్లో వుంటున్నారు. కుటుంబాన్ని భార్య పనికి పోయి జీవనం కొనసాగిస్తున్నారు. ఇది గమనించిన సాయి యువ సేన సంస్థ వారికి ఒక రెండు నెలల సరిపడా నిత్యావసర సరుకులు ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో గాజులపల్లి సర్పంచ్ గడ్డం చంటి .మాజీ ఎంపీటీసీ రమణ.రాము. వాలంటరీ జఫరుల్లా .హుస్సేన్.సాయి యువ సేన సంస్థ ప్రెసిడెంట్ రవి తదితరులు పాల్గొన్నారు.



## వైభవంగా రాములోరి వివాహ మహోత్సవ వేడుకలు

నందికొట్కూర్ నంద్యాల జిల్లా నందికొట్కూరు మండలం బ్రాహ్మణ కొట్కూర్ గ్రామంలో మహోత్సవాలు ఘనంగా జరిగాయి. గురువారం నాడు బ్రాహ్మణ కొట్కూరు గ్రామంలోని శ్రీ సీతారాముల విగ్రహాలను దాతలు గోరంట్ల నరేంద్ర దంపతులు అందజేశారు. ఈ కళ్యాణోత్సవం ను తిలకించేందుకు, భక్తులు భారీగా తరలివచ్చారు. అభయ ఆంజనేయ స్వామి ఆలయంలో సీతారాముల కళ్యాణం నిర్వహించారు. అంతకుముందు సీతారాములవారికి ఆంజనేయ స్వామికి విశేష పూజలు కొనసాగించారు. అనంతరం కల్యాణోత్సవంలో ముందుగా లోక క్షేమాన్ని కాంక్షిస్తూ వేద పండితుడు. సంకల్పాన్ని పఠిస్తారు. కళ్యాణోత్సవం నిర్విఘ్నంగా జరగాలని మహాగణపతికి పూజలు చేసి సీతారామచంద్రమూర్తికి కళ్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు.సీతమ్మ రాముడిని కోరలేదు విధే కలిపింది, రాముడు తనని అడవికి రమ్మని బతిమాల లేదు ఆమె అతని వెంట కదిలింది. కోరితేనో, బతిమాలితేనో మనతో ఉండేవారు బహుశా ఎప్పటికీ మనవాళ్లు కాలేరేమో.హక్కులకంటే బాధ్యత గొప్పదన్నది "రామ తత్వం", కష్టంలో కలిసి నడవాలన్నది "సీత తత్వం", కుటుంబ బాధ్యత పంచుకోవడం అన్నది "లక్ష్మణ తత్వం", నమ్మిన వారి కోసం తెగించ మంటుంది "ఆంజనేయ తత్వం".అందమైన జీవితం అనేది ఒక అద్భుతమైన ఊహ... ఎందుకంటే ఊహకందని అద్భుతమే జీవితం. మనకోసం ఎదురు చూసేవాళ్ళు "మన బలం".. మనల్ని ఎదురు చూసేలా చేసే వాళ్ళు "మన బలహీనత మరియు భక్తులు సీతారాములకు తలంబ్రాలు వేసి స్వామివారిని దర్శించుకున్నారు. జైశ్రీరామ్ నినాదాలతో భక్తులు హోరెత్తించారు. అలాగే భారీ ఎత్తున అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఈ కళ్యాణ మహోత్సవం లో వేద పండితుడు జంధ్యాల సురేష్ శర్మ ,అభయ ఆంజనేయ స్వామి అర్చకుడు. ఎ.రామనారాయణ ,విశ్వం బజరంగ్ దళ్ సేవా సమితి కార్యకర్తలు, మరియు గ్రామ ప్రజలు పాల్గొని వివాహ మహోత్సవాన్ని విజయవంతం చేశారు.

## స్టూడెంట్స్ ఇస్లామిక్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నీరుపేదలకు రమజాన్ కీట్స్ పంపిణీ

ఎమ్మిగనరు పట్టణంలోని మార్చి 30 గురువారం స్టార్ కిడ్స్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ లో స్టూడెంట్స్ ఇస్లామిక్ ఆర్గనైజేషన్ వారి తరుపున నీరుపేదలకు రమజాన్ కీట్స్ పంపిణీ చెయ్యడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముందుగా ఖురాన్ పఠనం తో ప్రారంభం అయింది. రమజాన్ విష్టత గురించి జమాత్ ఎ ఇస్లామి హింద్, జిల్లా బాధ్యులు చాందన్న మాట్లాడుతూ " అల్లాహ్ ఖురాన్ ను పవిత్ర మాసం రమజాన్ లో అవతరింపజేసాడు. ఈ గ్రంధం సమస్త మానవాళికి మార్గదర్శకం. దీనికి కృతజ్ఞతగా ముస్లింలు ఉపవాసాలు ఉంటారు" అని తెలియజేసారు.తర్వాత బతినీ రాష్ట్ర సలహా మండలి సభ్యులు ఇమ్రాన్ మాట్లాడుతూ " దీర్ఘకాల అనారోగ్యంతో బాధపడుతున్న వాళ్ళు తమ వంతు సహాయం కనీసం ఒక్క ఉపవాసికైన అందించాలని ఖురాన్ చెబుతుంది. ఇందుకోసమే కొంతమంది దాతలు ద్వారా బతినీ ఇక్కడ హాజరైన నిరుపేదలకు కీట్స్ అందిస్తుంది. ూమా గత 40 స దేశంలో యువకులు ు విద్యార్థులు లో విద్య పరంగా ు నైతిక పరంగా ఉత్తమంగా తీర్చిదిద్దుతుంది" ని సెలవిచ్చారు.చివరిగా ఎంపీజే రాష్ట్ర కార్యదర్శి ఖదీర్ గారి దుఆ తో కార్యక్రమం ముగిసింది.కార్యక్రమం అనంతరం రమజాన్ కీట్స్ అందించారు.

## చిల్లకూరులో ఆసరా కార్యక్రమం

గూడూరు చిల్లకూరు సంఘమిత్ర కార్యాలయం వద్ద వైయస్సార్ ఆసరా కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే వరప్రసాద్ కు మహిళలు హారతులు ఇచ్చి స్వాగతం పలికారు పొదుపు సంఘాల మహిళలు తయారుచేసిన పౌష్టిక ఆహారాపదార్థాలను ఎమ్మెల్యే రుచి చూశారు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు పొదుపు సంఘాల మహిళలకు ఆసరా చెక్కును అందజేశారు సమావేశంలో ఎమ్మెల్యే వరప్రసాద్ మాట్లాడుతూ 2014 ఎన్నికల ముందు మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అనేక హామీలు ఇచ్చారని పదవిలో ఉన్న ఐదు సంవత్సరాలు ఏ ఒక్కటి కూడా నెరవేర్చకుండా మోసం చేశారని అన్నారు పాదయాత్రలో పొదుపు మహిళల సమస్యలు విన్న జగన్మోహన్ రెడ్డి నాలుగు విడతల్లో పొదుపు మహిళలకు ఆర్థిక సహాయం అందిస్తామని హామీ ఇచ్చి తూచా తప్పక అమలు చేస్తున్నారని గుర్తు చేశారు మహిళలు అభివృద్ధి చెందితే దేశం ఎంతో అభివృద్ధి చెందుతుందని గుర్తించి ప్రతి సంక్షేమ పథకం కూడా మహిళలకే అందేలా చర్యలు తీసుకున్నారని మరలా ముఖ్యమంత్రిగా జగన్మోహన్ రెడ్డిని ప్రజలందరూ ఆశీర్వదించాలని కోరారు ఈ కార్యక్రమంలో జడ్పిటిసి మన్యం శ్రీనివాసులు ,ఏఎంసీ చైర్మన్ యమునమ్మ ,నారాయణ ,ఏపీవో వెంకటయ్య ,పొదుపు సంఘాల మహిళలు పాల్గొన్నారు .

## రంగ రంగ వైభవంగా కల్యాణ మహోత్సవం



నంద్యాల మా ప్రతినిధి (విభారె న్యూస్ ) నంద్యాల కోదండరామాలయం లో . శ్రీ రామనవమి పర్వదిన సందర్భంగా ఆలయ ప్రాంగణంలో జరిగిన దివ్య సీతారాముల వారి కళ్యాణోత్సవానికి విశేషంగా భక్తులు తరలి వచ్చారు. అశేష భక్తజన సందోహంతో మంగళకరంగా జరిగింది..ద్రాక్ష, చెర్రీ పండ్లతో సీతా లక్ష్మణ సమేత శ్రీ కోదండ రామస్వామి మూల విరాట్ వార్లకు మునుపెన్నడూ చేయని విశేష అలంకరణతో స్వామి వార్ల దివ్య తేజస్సును భక్తులను ఆకట్టుకున్నాయి . అమ్మవారికి వడి బాలోత్సవం అనంతరం భక్తులకు తీర్ద ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సమాజ్ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించారు.

## రమణీయం కమణీయం శ్రీ సీతారాముల కళ్యాణం

నంద్యాల మా ప్రతినిధి (విభారె న్యూస్) ::రమణీయం కమణీయం గా శ్రీ సీతారాముల కళ్యాణం మహోత్సవం వేడుకలు అంగ రంగ వైభోవంగా జరిగింది. గురువారం శ్రీరామనవమి సందర్భంగా చాగలమర్రి మండల శ్రీ సీతారామ ఆంజనేయ ఆలయంలో రాముని కళ్యాణ మహోత్సవ వేడుకలు గ్రామ పెద్దలు ,సెల్ సోక్ పరసస్ సలా నాగరాజు దంపతుల, రాష్ట్ర కార్యదర్శ గుత్తి నరసింహులు గారు, ధనంజయుడు , కసినేని ఓబులేసు నిర్వహించారు.ఆలయానికి విద్యుత్ దీపాలు మావిడకులు, పచ్చతోరణాలు పూలమాలలు వేసి ఘనంగా అలంకరించారు. వేదపండితులు సాక్షిగా సీతారాముల కళ్యాణం జరిగింది . వేదపండితులు కళ్యాణ మండపంలో శ్రీ సీతారాముల వేద మంత్రాలతో కల్యాణ మహోత్సవం జరిపించారు. అనంతరం వేదపండితులు మాట్లాడుతూ రామనామం ఎంతో ఉత్తమమైనది ప్రతి రోజు రామ నామం జరిపిస్తే కష్టాలు వెడలి సుఖసంతోషాలతో ఉంటారని తండ్రి కి కొడుకు మీద ఉన్న ప్రేమ, కొడుక్కి తండ్రిమీద ఉన్న గౌరవమని, భర్తకు భార్య మీద ఉన్న బాధ్యత, భార్యకు భర్త మీద ఉన్న నమ్మకం మని, అన్నకు తమ్ముడు మీద ఉన్న విశ్వాసం, తమ్ముడికి అన్న మీద ఉన్న మమకారం మనిషిలోని బలం మరో మనిషిలోని స్వార్థంఅండగానిలిచిన మనుషులు కలిపిన మనిషిని



మనిషిగా బ్రతకడానికి అవసరమైన దే మన రామాయణం అని వివరించారు. గ్రామ ప్రజలు భక్తులు కళ్యాణ మహోత్సవం ఆనందంగా తిలకించి టెంకాయలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం భక్తులకు నైవేద్యం, భోజన వసతులు కల్పించారు.

## ఇండియాని షేక్ చేసిన నేటి తరం స్టార్ మేకర్స్ వీళ్లే!



దక్షిణాది పరిశ్రమ ట్రెండ్ మార్చింది. ఇప్పుడు సౌత్ నుంచి సినిమా? వస్తుందంటే? ఇండియా మొత్తం షేక్ అవ్వాల్సిందే! అన్న రేంజ్ లో సౌత్ మేకర్స్ క్రియేటివిటీ కనిపిస్తుంది. స్క్రిప్ట్ పై లోతైన విశ్లేషణ. పాత్రల పరంగా ఎంపిక. స్టోరీ ఇన్నోవేషన్. ఇలా ప్రతీది డైరెక్టర్ విజన్ కి తగ్గట్టు మలుచుకోవడం వంటివి కీరోల్ పోషిస్తున్నాయి. నాలుగు ఫైట్లు..పాటలు పెట్టి సినిమా చేద్దాం? అనే రోజులకు ఈ నయా మేకర్స్ అంతా చెక్ పెట్టేసారు. సీనియర్లు..సూపర్ సీనియర్లని అందర్నీ క్రాస్ చేసి ఈ నయా మేకర్లు సినిమా అనే జిందగీనే ఏల్తున్నారు.టాప్ స్టార్లు అంతా పాన్ ఇండియా సక్సెస్ ఫుల్ దర్శకులపైనే పడుతున్నారు. ఈ పోటీ సౌత్ నుంచే కాదు ఉత్తరాది నుంచి కూడా గట్టిగానే ఉంది. మరి పరిశ్రమలో ఇంతగా మార్పు తీసుకొచ్చిన ఆ నయా మేకర్స్ ఎవరు? అంటే వివరాల్లోకి వెళ్లాల్సిందే. 'బాహుబలి'..'ఆర్ ఆర్ ఆర్' విజయాలతో రాజమౌళి ప్రతిభ దేశ సరిహద్దులే దాటి పోయింది. ఇప్పుడాయన పాన్ వరల్డ్ లో ఫేమస్ అవుతున్నారు. ఇటీవలే ఆస్కార్ కూడా అందుకోవడంతో! ఆయన రేంజ్ పూర్తిగా మారిపోయింది. జక్కన్నతో ఒక్క సినిమా అయినా చేయాలని అన్ని పరిశ్రమలో నటులు ఆశపడుతున్నారు.ఆ తర్వాతి స్థానంలో 'కేజీఎఫ్' ఫ్రాంచైజీ తో సంచలనం సృష్టించిన ప్రశాంత్ నీల్ ఉన్నారు. 'కేజీఎఫ్' హిట్ ఆయన్ని పాన్ ఇండియాలో ఫేమస్ చేసింది. ఓ చిన్న సినిమాతో లాంచ్ అయిన ప్రశాంత్ నీల్ కేజీఎఫ్ ఉప్పెనలా దూసుకొచ్చాడు. బాక్సాఫీస్ వద్ద ఈ సినిమా వసూళ్లు! నీల్ రేంజ్ ని అంతకంతకు రెట్టింపు చేసాయి. ఇక మరో క్రియేటివ్ మేకర్ సుకుమార్ 'పుష్ప' పాన్ ఇండయా సక్సెస్ తో! 'పుష్ప-2'ని అంతర్జాతీయ స్థాయిలోనే తెరకెక్కిస్తున్నారు.ఎలాంటి అంచనాలు లేకుండా రిలీజ్ అయిన సినిమా హిందీ బాక్సాఫీస్ ని రప్పాడించేసింది. దీంతో సుకుమార్ రెండవ భాగానికి సంబంధించి స్క్రిప్ట్ ని ఇంటర్నేషనల్ కి రీచ్ అయ్యేలా రీ-డిజైన్ చేసి బరిలోకి దిగారు. అలాగే కోలీవుడ్ యువ కెరటం లోకేష్ కనగరాజ్ 'ఖైదీ'-విక్రమ్ సక్సెస్ తో తనకంటూ ఓ యూనివర్శ్ ఉందని క్రియేట్ చేసుకున్నాడు. ఇండియాలో ఇంత వరకూ ఏ మేకర్ ఇలాంటి ఆలోచనతో ముందుకు రాలేదు. దీంతో లోకేష్ పాన్ ఇండియా వైడ్ ఫేమస్ అవుతున్నారు.ఇక మరో తెలుగు సంచలనం చందు మొండేటి! అనన్య సామాన్యుడని 'కార్తికేయ-2'తో నిరూపించారు. తనలో యూనిక్ ఐడియాలజీని ఈ సినిమాతో వర్కౌట్ చేయగలిగారు. సెన్సిబుల్ స్టోరీని కమర్శియల్ యాస్పెక్ట్ లో పాన్ ఇండియాకి కనెక్ట్ చేయడంలో సక్సెస్ అయిన మేకర్. ఎలాంటి అంచనాలు లేకుండా రిలీజ్ అయినా ఈ సినిమా పాన్ ఇండియా లో అతి పెద్ద సక్సెస్ సాధించింది. దీంతో సీక్వెల్ ని అంతర్జా తీయ స్థాయిలో ప్లాన్ చేస్తున్నారు.మరో కన్నడం

సంచలనం 'కాంతార' తో కనక వర్షం కురిపించిన రిశబ్ శెట్టి క్రేజ్ పీక్స్ లో ఉంది. యంగ్ మేకర్ కోసం బడా నిర్మాణ సంస్థలే క్యూలో ఉన్నాయి. అలాగే తమిళ దర్శకుడు అట్లీ పేరు మార్కెట్ లో జోరుగా వినిపిస్తుంది. ఆ క్రేజ్ తోనే షారుక్ ఖాన్ నే డైరెక్ట్ చేసే అరుదైన అవకాశం ఒడిసిపట్టుకున్నారు. ఈ నయా మేకర్స్ అంతా భవిష్యత్ లో మరిన్ని వండర్స్ క్రియేట్ చేయగల సత్తా ఉన్నవారని పరిశ్రమ బలంగా విశ్వషిస్తుంది.

## అలీకి పోటీగా తయారైన వెన్నెల కిషోర్!

కమెడియన్ అలీ హోస్ట్ చేస్తోన్న 'అలీతో సరదాగా' టీవీ షో ఎంత పెద్ద సక్సెస్ సాధించిందో తెలిసిందే. సెలబ్రిటీ ఇంటర్వ్యూలతో అలీ ఆ ఛానెల్ టీఆర్పీ రేటింగ్ ని పెంచారు. నటీనటులకు సంబంధించి వృత్తి-వ్యక్తిగత విషయాలపై జరిగే చర్చ ఆద్యంతం వీక్షకుల్ని ఆకట్టుకుంటుంది. ఆరోగ్యకరమైన వాతావరణం లో సాగే ఇలాంటి టాక్ టీవీ షో తెలుగు ప్రేక్షకులకి కొత్త అనుభూతిని పంచుతుంది.సెలబ్రిటీ ఇంటర్వ్యూ లపై చాలా ఛానెల్స్ ప్రోగ్రామ్స్ చేసాయి. కానీ అలీ టాక్ షో సక్సెస్ అయినంతగా మరో సెలబ్రిటీ షో సక్సెస్ అవ్వలేదు. ఆ రకంగా అలీ మంచి హోస్ట్ గా పేరు సంపాదించుకున్నారు. ఓవైపు నటుడిగా కొనసాగుతూనే ఈ షోను నిర్వహిస్తున్నారు. తాజాగా అలీకి పోటీగా మరో నటుడు సిద్ధమైనట్లు తెలుస్తుంది. కమెడియన్ వెన్నెల కిషోర్ కూడా అలీ తరహాలోనే ఓ టీవీ షోను హోస్ట్ చేస్తున్నారు.తొలిసారి బుల్లి తెర ప్రేక్షకుల్ని మెప్పించబోతున్నారు. 'అలా మొదలైంది' షోతో టీవీలోకి ఎంట్రీ ఇస్తున్నారు. ఇందులో కూడా సెలబ్రిటీ ఇంటర్వ్యూలే నిర్వహిస్తున్నారు. అయితే ఈ షోలో పెళ్లైన జంటలు పాల్గొంటున్నారు.తమ జీవన యానంలో సరదాలు- సమస్యల- అలకలు-ఆనందాలు- చిత్రాలు విచిత్రాలు అన్ని పంచుకుంటే వినడానికి చూడటానికి ఎంత బాగుంటుంది? అందుకే అలాంటి వినూత్నమైన కార్యక్రమాన్ని ఎంచుకుని వెన్నెల కిషోర్ వ్యాఖ్యతగా బుల్లి తెర ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు.పీపుల్ మీడియా సంస్థ ఈ ప్రోగ్రామ్ ని నిర్వహిస్తుంది. మొదటి ఎపిసోడ్ నేడు ప్రసారం కానుంది. ఇప్పటికే షూట్ సహా అన్ని పూర్తిచేసారు. అయితే మొదటి ఎపిసోడ్ కి యంగ్ హీరో నిఖిల్-ఆయన సతీమణిని షోకి ఆహ్వానించారు.ఇద్దరు జంటగా టాక్ షోలో పాల్గొంటారు. ఇందులో ఎక్కువగా వారికి సంబంధించిన వ్యక్తిగత విషయాలే చర్చిస్తారు. అదే ఈ ప్రోగ్రామ్ ప్రధాన ఎజెండాగా తెలుస్తుంది. అలీ టాక్ షోకి కొంచెం భిన్నంగానే ఉంటుందని చెప్పొచ్చు.




## ఫ్యామిలీ సినిమాలు తీసే నేను రియల్ లైఫ్ లో మాత్రం బ్యాడ్ సన్



క్రియేటివ్ డైరెక్టర్ చాలా గ్యాప్ తర్వాత రంగమార్తాండ సినిమా తో ప్రేక్షకుల ముందుకు వచ్చాడు. దాదాపు నాలుగు సంవత్సరాల పాటు ఈ సినిమా కోసం కృష్ణ వంశీ వర్క్ చేసిన విషయం తెల్సిందే. ప్రకాష్ రాజ్.. రమ్యకృష్ణ.. బ్రహ్మానందం.. శివాత్మిక రాజశేఖర్.. రాహుల్ సిప్లిగంజ్.. అనసూయ కీలక పాత్రల్లో నటించిన ఈ సినిమాకు పాజిటివ్ రెస్పాన్స్ దక్కించుకుంది.మంచి రివ్యూలు రావడంతో పాటు చూసిన ప్రేక్షకులు కూడా బాగుందని అంటున్నారు. కానీ కలెక్షన్స్ మాత్రం టాక్ కి తగ్గట్లుగా రావడం లేదు. రంగమార్తాండ సినిమా కమర్షియల్ గా ఆశించిన స్థాయిలో ఫలితాన్ని సొంతం చేసుకోలేక పోయినా కూడా దర్శకుడు రంగమార్తాండ పై విమర్శకుల ప్రశంసలు కురుస్తున్నాయి. క్రియేటివ్ డైరెక్టర్ కృష్ణ వంశీ ఇన్నాళ్లకు తన మార్క్ సినిమా ను ఇచ్చాడంటూ ఫ్యాన్స్ అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.తాజాగా కృష్ణ వంశీ సినిమాకు వస్తున్న రెస్పాన్స్ నేపథ్యంలో మీడియా ముందుకు వచ్చి తన సంతోషాన్ని పంచుకున్నాడు. కృష్ణవంశీ మాట్లాడుతూ... రంగమార్తాండ సినిమాకు వస్తున్న స్పందన చూస్తూ ఉంటే సంతోషంగా ఉంది.ఇప్పటి వరకు నేను చేసిన సినిమాల్లో ఇది చాలా స్పెషల్ సినిమా. మెగాస్టార్ చిరంజీవి వంటి దిగ్గజం నుండి సినిమాకు ప్రశంసలు అందుకోసం చాలా ప్రత్యేకం. సోషల్ మీడియా ద్వారా కూడా సినిమాకు పాజిటివ్ రెస్పాన్స్ దక్కడం సంతోషంగా ఉంది.సినిమా విడుదలకు ముందు ఎక్కువ పబ్లిసిటీ చేయకున్నా కూడా విడుదల తర్వాత పబ్లిక్ టాక్ తో ఎక్కువ ప్రచారం జరిగింది. ఇది మన అమ్మా నాన్నల కథ అంటూ ట్యాగ్ ఇవ్వడం వల్ల చాలా మందికి కనెక్ట్ అవుతుందని కూడా కృష్ణ వంశీ పేర్కొన్నాడు. ఫ్యామిలీ సినిమాలు తీయడంలో సక్సెస్ అయిన నేను రియల్ లైఫ్ లో మాత్రం బ్యాడ్ సన్ అన్నట్లుగా చెప్పుకొచ్చాడు.అమ్మా నాన్నలతో నేను ఎక్కువగా కనెక్ట్ అవ్వలేదు. చిన్నప్పటి నుండి కూడా ఫ్యామిలీకి ఎక్కువగా కనెక్ట్ అవ్వలేక పోయాను. నాన్న ఎప్పుడో చనిపోయారు. అమ్మ నాతోనే ఉంటున్నారు. నేను ఒక బ్యాడ్ సన్ అంటూ తనపై తానే కృష్ణ వంశీ కౌంటర్ వేసుకున్నారు. ఇంట్లో ఇతరులతో కూడా ఎక్కువగా క్లోజ్ ఉండలేను అంటూ కృష్ణవంశీ పేర్కొన్నాడు.

## సీఎస్కేకు బిగ్ షాక్.. ధోని దూరం! కెప్టెన్‌గా రుతురాజ్

ఐపీఎల్-2023 సీజన్‌కు రంగం సిద్ధమైంది. శుక్రవారం అహ్మదాబాద్ వేదికగా జరగనున్న గుజరాత్ టైటాన్స్-చెన్నైసూపర్ కింగ్స్ మ్యాచ్‌తో ఈ క్యాష్ రిచ్ లీగ్‌కు తెరలేవనుంది.అయితే తొలి మ్యాచ్‌కు ముందు చెన్నై సూపర్ కింగ్స్ ఊహించని షాక్ తగిలింది. ఆజట్టు కెప్టెన్ ఎంఎస్ ధోని గుజరాత్‌తో జరగనున్న తొలి మ్యాచ్‌కు గాయం కారణంగా దూరం కానున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి.ఈ మ్యాచ్‌కు ముందు జరిగిన ప్రాక్టీస్ సెషన్‌లో ధోని ఎడమ కాలికి గాయమైనట్లు "స్పోర్ట్‌స్టార్" తమ నివేదికలో వెల్లడించింది. ఈ క్రమంలో అతడికి తొలి మ్యాచ్‌కు విశ్రాంతి ఇవ్వాలని సీఎస్కే వైద్యబృందం సూచించినట్లు సమాచారం. ఒక వేళ ధోని దూరమైతే బెన్‌స్టోక్స్ లేదా రుతురాజ్ గైక్వాడ్ చెన్నై కెప్టెన్‌గా వ్యవహరించే అవకాశం ఉంది.చెన్నై సూపర్ కింగ్స్ తుది జట్టు(అంచనా): డెవాన్ కాన్వే(వికెట్ కీపర్), రుతురాజ్ గైక్వాడ్, అజింక్య రహానె, మొయిన్ అలీ, శివం దూబే, అంబటి రాయుడు, బెన్ స్టోక్స్, రవీంద్ర జడేజా, దీపక్ చాహర్, ముఖేష్ చౌదరి, మతీషా పతిరనా



## ఐపీఎల్‌కు ముందు దినేష్ కార్తీక్‌కు బంపరాఫర్.. ఒకే ఒక్కడు!

టీమిండియా వెటరన్ వికెట్ కీపర్ దినేష్ కార్తీక్‌కు బంపరాఫర్ తగిలింది. ప్రతిష్టాత్మక యాషెస్ సిరీస్‌లో కామెంటేటర్‌గా వ్యవహరించే అవకాశం కార్తీక్‌కు దక్కింది.ఈ ఏడాది జరగనున్న ఈ సిరీస్ కోసం స్కై క్రికెట్ ఛానెల్ తరఫున కార్తీక్ కామెంట్రీ బాక్స్‌లో అడుగుపెట్టనున్నాడు. ఈ విషయాన్ని డీకేనే స్వయంగా వెల్లడించాడు.ఈ ప్రతిష్టాత్మక సిరీస్‌లో కార్తీక్‌తో పాటు ఇయాన్ మోర్గాన్, కెవిన్ పీటర్సన్, రిక్కీ పాంటింగ్, మార్క్ టేలర్, కుమార సంగక్కర, మెల్ జోన్స్, ఇయాన్ వార్డ్, నాసీర్ హుస్సేన్, అథెర్టన్, మార్క్ బౌచర్, ఆండ్రూ స్ట్రాస్ వాఖ్యతలగా వ్యవహరించనున్నారు. కాగా భారత్ నుంచి ఈ సిరీస్‌లో కామెంట్రీ చేయబోతున్నది కార్తీక్ ఒక్కడే కావడం విశేషం."ఐపీఎల్-2023 ప్రారంభానికి ముందు ఓ బిగ్‌న్యూస్‌ను షేర్ చేయడానికి సిద్ధమయ్యాను. 2023 యాషెస్ కామెంట్రీ ప్యానెల్‌లో నేను భాగంగా కానున్నాను. దిగ్గజాలతో కలిసి వాఖ్యతగా వ్యవహరించే అవకాశం రావడం చాలా సంతోషంగా ఉంది. నాకు ఈ అవకాశం ఇచ్చినందుకు స్కై క్రికెట్‌కు ధన్యవాదాలు" అని కార్తీక్ ట్విటర్‌లో పేర్కొన్నాడు. కాగా ఇటీవల ముగిసిన బోర్డర్ గావస్కర్ ట్రోఫీలో కూడా కార్తీక్ వాఖ్యతగా వ్యవహరించాడు.ఇక జాతీయ జట్టులో కోల్పోయి కామేంటేటర్‌గా అవతారమెత్తిన డీకే.. ప్రస్తుతం ఐపీఎల్‌కు సన్నద్ధమవుతున్నాడు. కార్తీక్ ఐపీఎల్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుకు ప్రాతినిథ్యం వహిస్తున్న సంగతి తెలిసిందే. గతేడాది సీజన్‌లో ఫినిషర్‌గా కార్తీక్ అదరగొట్టాడు. ఇక ఐపీఎల్-2022 మార్చి 31 నుంచి ప్రారంభం కానుంది. ఆర్సీబీ తమ తొలి మ్యాచ్‌లో బెంగళూరు వేదికగా ఏప్రిల్ 2న ముంబై ఇండియన్స్‌తో తలపడనుంది.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH.
PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190